www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025
5
వైఎస్ఆర్

ఇంజినీరింగ్ కళాశాల స్కాలర్ లక్ష్మీ ప్రవల్లికకు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ స్కాలర్ ఆర్.లక్ష్మీ ప్రవల్లికకు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. స్కాలర్ లక్ష్మీ ప్రవల్లిక ఆ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఆర్.ప్రదీప్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో 'ఏ కాంప్రహెన్సివ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ బ్రెయిన్ ట్యూమర్ సెగ్మెంటేషన్ యూజింగ్ ఆప్టిమైజ్డ్ క్లస్టర్ అల్గారిథమ్ అండ్ డీప్ ఎన్కోడర్- డీకోడర్ ఆర్కిటెక్చర్ విత్ డైస్ లాస్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయం విసి మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షల బోర్డు అలానే వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా లక్ష్మీ ప్రవల్లిక థీసిస్ డాక్టరేట్‌కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు స్కాలర్ లక్ష్మీ ప్రవల్లికకు పిహెచ్‌డి నోటిఫికేషన్‌ను ప్రకటించారు.

నేటి నుంచి కడప బాలోత్సవ సందడి

పిల్లల్లో సృజన, నైపుణ్యాల ప్రోత్సాహం
నిర్వహణ ఏర్పాట్లు పూర్తి

నిర్వహణకు ముస్తాబైన వేదిక

ప్రజాశక్తి- కడప అర్బన్

బాల్యంలోని మధురిమలను తన మనోఫలకంపై జీవితకాలం గుర్తుంచుకునే రెండు రోజుల చిన్నారుల పండుగ బాలోత్సవం శనివారం ప్రారంభం అవుతోందని నిర్వాహకులు వెల్లడించారు. కడప జిల్లా బాలోత్సవ అధ్యక్షులు జి. గోపాల్, గౌరవాధ్యక్షులు నాగముని రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ రాహుల్, కోశాధికారి ఎస్.సాయి సునీత దేవి మాట్లాడుతూ కడప మరియాపురం, సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాల వేదికగా జరిగే కడప బాలోత్సవం మూడవ పిల్లల పండుగ కు దాదాపు 6 నుంచి 8 వేల మంది బాలబాలికలు హాజరయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకు తగ్గట్టు వివిధ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవి, ఎంఎల్‌సి రాంగోపాల్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, డిఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, డిఇఒ షంషుద్దీన్ రానున్నారని తెలిపారు. సృజనని పెంచే చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలు, ఆట, పాటలు, కథలు, పిల్లలు స్వేచ్ఛగా వారి ఆలోచనలను, అభిప్రాయాలను వ్యక్తం చేసే కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలకు అల్పాహారం, భోజన సౌకర్యంతో పాటు, ప్రతిభావంతులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

కలుషిత ఆహారం తిని
విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులోని వసంతపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. 10 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేస్తుండగా కడుపునొప్పి, వాంతులు రావడంతో వారిని ఉపాధ్యాయులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కందిపప్పు పురుగు పట్టకుండా ఉండేందుకని కందిపప్పు బస్తాలో గుళికలు వేశారు. వేసిన గుళికలతో పాటు పప్పును ఉడకబెట్టడంతో కలుషితమై పప్పును తిన్న విద్యార్థులు అస్వస్థత గురయ్యారు. తొలుత ఈ సమాచారాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి తెలిపినా నిర్లక్ష్యం వహించారని విద్యార్థులు తెలిపారు. అనంతరం విద్యార్థులు మీడియాను ఆశ్రయించడంతో స్పందించిన హెచ్‌ఎం విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా వంట ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే రాజమల్లు ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఘనంగా భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ గురు, శుక్ర వారం కడప నగరంలోని అజ్మత్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గాయని స్వర్ణలత తమ బృందంతో హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను, ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్, కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులపై చదువుల ఒత్తిడి పెరిగిపోవడం, అసమానతల కారణంగా ఆత్మహత్యలు వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వారికి మానసిక ఊరటనిచ్చేలా, వారిలోని ప్రతిభను వెలికితీయడానికి ఈ స్టూడెంట్ ఫెస్ట్‌ను చేపట్టామని తెలిపారు. ఫెస్ట్‌లో డాన్స్‌లు, పాటలు, స్టాండ్‌అప్ కామెడీ, నాటకాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, విజయం సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎఫ్ఐ పోరాటాలు మాత్రమే కాకుండా ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రతి ఏడాది ఒకసారి ఈ ఫెస్ట్‌ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

సర్టిఫికెట్, మెమొంటోలతో విద్యార్థులు

కడప జిల్లాలోని ప్రతి విద్యార్థి పాల్గొని తన ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుమంత్, అభినయ్, నాయకులు నవీన్, అఖిలేష్, సాగర్, కార్తీక్, శ్రీను, మనోహర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇంటర్ జోనల్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప : ఎసిఎ అండర్ -14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు 79.3 ఓవర్లలో 235 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని యాసీన్ సిద్ధిక్ 91, రితీష్ 49 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని ఉనాయిస్ 4, సర్దార్ సమీర్ 2, తులసి రామ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 80.1 ఓవర్లలో 206 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి కృష్ణ చైతన్య 41, యశ్వంత్ సూర్య 37 పరుగులు చేశారు. నార్త్ జట్టులోని చాణిక్య సాయి 3, షణ్ముఖ గణేష్ 3 వికెట్లు తీసుకున్నారు. బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 9.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 12 పరుగులు చేసింది.

తలపడుతున్న రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, విన్నర్స్ సెంట్రల్ జోన్ జట్లు

విధినిర్వహణలో ఉత్సాహవంతులు ఆదినారాయణ

ప్రజాశక్తి - బద్వేలు

విధి నిర్వహణలో డిప్యూటీ ఎంపిడిఒ ఆది నారాయణ ఉత్సాహంగా విధులు నిర్వహిస్తారని ఎంపిడిఒ మల్లీశ్వరి పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపి డిఒగా విధులు నిర్వహించి ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొంది అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలానికి వెళ్తున్న సందర్భంగా ఆయన్ను శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తాను పనిచేసిన మండలాలలో పనిమీద ఉత్సాహం ఉన్నటువంటి వ్యక్తి ఆదినారాయణ అని పేర్కొన్నారు. ఆదినారాయణ మాట్లాడుతూ తాను పనిచేసిన 34 సంవత్సరాల సర్వీసులో బద్వేలు మండలంలో ఉన్నంత ప్రశాంత వాతావరణం, సిబ్బంది సహకారం తాను ఎప్పటికీ మర్చిపోనని పేర్కొన్నారు. తనకు సహాయ సహకారాలు అందించిన కార్యాలయ సిబ్బందికి, పంచాయతీ అభివృద్ధి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి, కోనసముద్రం సర్పంచి పాల్గొన్నారు.


ఆదినారాయణను సన్మానిస్తున్న ఎంపిడిఒ, సిబ్బంది

నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి కడప అర్బన్

కడప నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శుక్రవారం 34వ డివిజన్‌లో 'మన కడప -స్వచ్ఛ కడప' కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ ప్రాంతంలోని శుభ్రత, డ్రైనేజ్, చెత్త నిర్వహణ, వీధి లైట్ల పరిస్థితి, పౌరసౌకర్యాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, తక్షణ పరిష్కారం కోసం మున్సిపల్ అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ మనోజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేష్ చంద్రం, టిడిపి మైనారిటీ ఉపాధ్యక్షులు జిలాని బాష, 34వ డివిజన్ ఇన్‌ఛార్జి జావిద్ బాష, టిడిపి కడప నగర అధ్యక్షుడు పి.మన్సూర్ అలీ ఖాన్, రాష్ట్ర డాక్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ నజుముద్దీన్, 34వ బూత్ ఇన్‌చార్జ్ అక్రమ్ ఖాన్, ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4న వాలీబాల్ ఎంపికలు

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ బోర్డు దక్షిణ భారత అంతర విశ్వ విద్యాలయాల వాలీబాల్ పోటీలలో పాల్గొనబోయే విశ్వ విద్యాలయ వాలీబాల్ స్త్రీ, పురుషుల జట్ల కోసం డైరెక్ట్ సెలెక్షన్ ట్రైల్స్ డిసెంబర్ 4న ఉదయం 9.00 గంటలకు నిర్వహిస్తున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి ఒక ప్రకటన తెలిపారు. పాల్గొన దలచిన క్రీడాకారులు సంబంధిత సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికలు విశ్వ విద్యాలయ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని తెలిపారు.

అమీన్‌పీర్ దర్గాలో
రాజు వెడ్స్ రాంబాయ్ సినిమా యూనిట్

ప్రజాశక్తి - కడప అర్బన్

అమీన్ పీర్ దర్గాను రాంబాయ్ చిత్రం యూనిట్ శుక్రవారం సందర్శించారు. హీరో అఖిల్ రాజ్, హీరోయిన్ తేజేశ్వి, డైరెక్టర్ సాయిల్ కాం పాటి, రైటర్ మెట్టపల్లి సురేంద్ర, ఈ టివి నీతిన్, ఆర్టిస్ట్ విక్రమ్ ఆదిత్య, చైతన్య జొన్నలగడ్డ, ప్రొడ్యూసర్ రాహుల్ మోపిదేవి పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. దర్గాకు రావడం ఆనందంగా ఉందన్నారు. సినిమా హిట్ కావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రాజు వెడ్స్ రాంబాయ్ సినిమాను ప్రతిఒక్కరూ చూసి ఆశీర్వదించాలని కోరారు.

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వంకెల పెద్దపోలిరెడ్డి

ప్రజాశక్తి - బద్వేలు : వైసిపి అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బద్వేలు నియోజకవర్గానికి చెందిన వంకెల పెద్ద పోలిరెడ్డిని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా సందర్భంగా శుక్రవారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివ్ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు వెంకటసుబ్బారెడ్డి, బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద పోలిరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. తనకు పదవి బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. పదవి రావడానికి సహకరించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి , పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వంకెల పోలిరెడ్డి, సర్పంచ్ జయరారెడ్డి, కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి, పార్టీ జిల్లా యాక్టివ్ సెక్రెటరీ ప్రభాకర్ రెడ్డి, పోరుమామిళ్ల మండలం అబ్జర్వర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సిద్దవటంను కడప జిల్లా నుంచి తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్వవస్థీకరణ భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌లో ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను అన్నమయ్య జిల్లాలో విలీనం చేయడం కూటమి ప్రభుత్వం కడప జిల్లాకు చేస్తున్న చారిత్రక ద్రోహమని డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. సిద్ధవటం కడప జిల్లాలో అంతర్భాగమని సిద్ధవటం లేకుండా కడప జిల్లా చరిత్రను గాని కడప జిల్లా భౌగోళిక , రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక అంశాలను చూడలేమని పేర్కొన్నారు. చారిత్రక అంశాలను విస్మరించి కేవలం రాజకీయ దృష్టితో విభజన చేయడం అనేది సమంజసం కాదని తెలిపారు. ఆధ్యాత్మికతక అనుబంధాన్ని కడప జిల్లా ప్రజల నుంచి దూరం చేయకూడదన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ రన్నర్స్‌కు అభినందనలు

ప్రజాశక్తి - కలసపాడు : జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో పెండ్లిమర్రి కెజిబివి విద్యార్థినులు రన్నర్స్‌గా నిలవడం అభినందనీయమని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా ఆర్థికకార్యదర్శి యు.సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఇటీవల జాతీయ స్థాయి కబడ్డీ అండర్-19 పోటీలలో పాల్గొన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినిలు రన్నర్స్‌గా నిలిచిన సందర్భంగా ఎస్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.వాణి, విద్యార్థినులు హేమశ్రీ,కల్యాణి, షఫియా, మంజుల,శృతి, మహేశ్వరి, సుమాంజలి, నిహారిక, కీర్తి, శిరీష, అమరావతి, కీర్తని శాలువ, బహుమతులతో సన్మానించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని రంగాలలో బాలురతోపాటు బాలికలు రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. క్రీడలలో, చదువులో,సమాజంలో బాలికలు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్య దర్శులు ఎస్.వి. సత్యనారాయణ, ఎం.బాలరాజు నాయక్, పి.గురు ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సి.వెంకటరెడ్డి, జిల్లా కమిటీసభ్యులు మూల రామకృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిలర్ విజయ భాస్కర్ రెడ్డి,శివశంకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి - కడప

సామాజిక విప్లవ కారుడు, కుల వివక్షత, అంటరానితనంపై పోరాటం చేసి వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు, మహిళలకు విద్యా అవకాశం కల్పించి సమాజంలోని అసమానతల పైన ఉద్యమించిన గొప్ప సంఘసంస్కర్త శ్రీ మహాత్మ జ్యోతి రావు పూలే అని కడప జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి అన్నారు. జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని పాత బస్టాండు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో కడప జిల్లా రజక నాయకులు కృష్ణమూర్తి, మల్లయ్య, ఎరికలయ్య, వెంకట్రావు, కేశవులు, హరి. బిసి నాయకులు పాల్గొన్నారు. **జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..** బిసిల అసజ్యోతి, మహిళా విద్యా ప్రధాత, జ్యోతి బా పూలే, 135వ వర్ధంతి సందర్భంగా కడప పాత బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న కాంశ్య విగ్రహానికి జిల్లా బిసి సంక్షేమ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కడప జిల్లా బిసి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు గురుస్వామి, ప్రధాన కార్యదర్శి మూలకాని త్రివిక్రమ్, క్రమశిక్షణ సలహాదారు కల్యా సుధాకర్, ఉపాధ్యక్షులు రెల్ల మునిరత్నం గౌడ్, ఓబన్న,రామచంద్ర, రామ్మూర్తి నాయుడు,గౌరవ సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి గొడుగు హరికుమార్, గొడుగు సూర్యుడు, గోవిందు నాగరాజు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న చేలోరవి

ఎన్నికైన నూతన కార్యవర్గం

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.కాటమయ్య, కార్యదర్శిగా ఎం. గిరిధర్, ఎన్.వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శిగా యన్. వెంకట సుబ్బయ్య సహా అధ్యక్షులు గా ఎస్. జానకి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి.రామ సుబ్బయ్య, ఉపాధ్యక్షులు రామ చంద్ర, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ వి. విజయకుమారి, జిల్లా జాయింట్ సెక్రటరీ కె.వై.నాగేష్, జిల్లా కోశాధికారి సి.సుబ్బిరెడ్డి ఎన్నికయ్యారు.

ముంపు రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

ఇటీవల సంభవించిన వరద కారణంగా మండలంలోని చెర్లోపల్లిలో సుమారు 1200 ఎకరాలలో రైతులు నష్టపోయారని, వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించలాని రైతు సంఘం మండల కారయదర్శి ఎన్. బైరవప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కొండు గారిపల్లె, తిరువెంగళాపురం, కొత్తూరు, టేకూరు టేకురుపేట, సూరిసిద్దుపల్లె కొట్టాలపల్లె, తిమ్మారెడ్డిపల్లె, తోకలపల్లె, కవలకుంట్ల, దాసరి పల్లె దుగ్గాయిపల్లె పోరపాటు పల్లె కొర్రపాటి పల్లె కట్టికిందపల్లె దుమ్మనపల్లె గ్రామాల చెర్లోపల్లె పరిసర గ్రామాల రాసాయిపేట, చిన్నరసాల, పెద్దసాల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఈనెల 30 నిర్వహించే రైతు మహాసభ సదస్సును జయప్రదం చేయాలని ఆటో జాతా నిర్వహించారు. ఈ ంసదర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చాలా ఏళ్లుగా వరదలు వస్తే వందల ఎకరాలు మునిగిపోయి పంట నష్టాలతో అల్లాడుతున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదని వాపోయారు. వ్యవసాయంలో నష్టం వచ్చి ఇప్పటికే రైతులు వలసల బాట పట్టారని పేర్కొన్నారు. చాలా మంది దుబాయ్‌కు,కువైట్ వంటి విదేశాలకు వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్నారిన వాపోయారు. రైతులు ఆదుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. రైతులకు పరిహారం చెల్లించే వరకు పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు కల్లూరు రమణారెడ్డి. పోలయ్య గురయ్యా,చిన్నయ్య రాజు, ఓబులయ్య, పాల్గొన్నారు

జిల్లా యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యదర్శిగా సిద్ధిక్

ప్రజాశక్తి - కడప : కడప జిల్లా యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యదర్శిగా షేక్. మొహమ్మద్ సిద్ధిక్‌కు నియమితులయ్యారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కన్యాకుమారి పార్లమెంట్ సభ్యులు విజయవసంత్, డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి చేతుల మీదుగా నియామక పత్రాన్ని ందుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధిక్ మాట్లాడుతూ డిసిసి అధ్యక్షురాలు విజయ్ జ్యోతి మార్గదర్శకత్వంలో, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ పర్యవేక్షణలో ముందుకు వెళతాను అన్నారు. పార్టీ తనకు సముచిత స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, కడప సిటీ మైనారిటీ అధ్యక్షులు ముబారక్ భాషా, కడప జిల్లా అన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కడప నగరంలోని అన్ని డివిజన్ల ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : అనంతపురం జిల్లా రామగిరి మండలం, మంగళూరు గ్రామంలో హెల్పర్‌గా పని చేస్తున్న ఇంద్రజను ఈడ్చి దాడి చేసిన శ్రీనివాసులు, కుమారుడు విష్ణు, భార్య బాలమ్మ, బామ్మర్ది ఓబయ్యను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి, కోశాధికారి ఎం.పి.అంజనాదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. హెల్పర్ పోస్ట్‌కు రాజీనామా చేయలేదని దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఆరు, ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్న హెల్పర్‌పై రాజీనామా చేయమని ఒత్తిడి చేయడం, దాడి చేయడం శోచనీమన్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

ఎంపిడిఒ మైథిలికి సన్మానం

ప్రజాశక్తి- కాశినాయన : మండలంలో ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న మైథిలి ఏపీడీగా మైదుకూరుకు బదిలీ అయ్యారు. శుక్రవారం ఆమెను బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి నరసాపురం ఎంపిడిఒ కార్యాలయంలో కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. మండలానికి చేసిన సేవలు మరువలేమన్నారు. ఇలాంటి ఉద్యోగోన్నతలు మరెన్నో అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మండల టిడిపి నాయకులు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, రోషి రెడ్డి, డి.వి.సుబ్బారెడ్డి, విజయ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, పీరావలి, జయ కృష్ణారెడ్డి, కొండారెడ్డి, నర్సిరెడ్డి, రాయుడు, మహబూబ్ బాషా, జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- బద్వేలు : కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ బద్వేల్ పురపాలక సంఘంలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రధానంగా పారిశుధ్యేతర పనులు నిర్వహిస్తున్న 15 మందికి పారిశుధ్య పనులు కేటాయించాలని, రక్షణ పరికరాలైన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, దుస్తులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 17 రోజుల సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని కోరారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని చెప్పారు. చెత్త తరలించు వాహనాల మరమ్మతులు పూర్తి స్థాయిలో చేయించి ఇన్సూరెన్సులు రెన్యువల్ చేయాలని కోరారు. వాహనాల మరమ్మతుల్లో చోటు చేసుకుంటున్నా అవినీతిని అరికట్టాలన్నారు. స్పందించిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కార్మికుల సమస్యల పరిష్కారానికి గౌరవ కమిషనర్‌తో చర్చిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, యూనియన్ అధ్యక్ష -కార్యదర్శులు యన్. సత్యరాజు, కె.నాగేంద్రబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.హరి, ఉపాధ్యక్షులు డి.దేవమ్మ, పాలయ్య కార్యదర్శులు జి. శ్రీనివాసులు, బి.ప్రవీణ్ కుమార్, కోశాధికారి కె.శివ కుమార్ కమిటీ సభ్యులు టి.కిరణ్, కార్మికులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ గడువు రెండు నెలలు పొడిగింపు

ప్రజాశక్తి - కడప : జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో రెండు నెలలు పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారని, ప్రస్తుతం నవంబర్ 30 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో రెండు నెలలు పొడిగిస్తున్నామని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 1 నుంచి 2026 జనవరి 31 వరకు లేదా నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసే వరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిత్ ఉపాధ్యక్షురాలు బోగా గగీతదేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా మండల జడ్‌పిటిసి ముద్దుకృష్ణ రెడ్డి హాజరయ్యారు. ఎంపిడిఒ సుజాతమ్మ సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. అజండా ప్రకారం అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు చేసిన అభివృద్ధి, చేపట్టబోయే పనుల గురించి వివరించాలని ఆదేశించారు. ఇందులోనూ పాత పద్ధతిలోనే గతంలో ప్రవేశపెట్టిన పనుల గురించే మాట్లాడారే తప్ప కొత్తగా ఏమీ ప్రస్తావించలేదు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట జడ్‌పిటిసి ముద్దుకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శులు, వారి సిబ్బంది సరిగ్గా విధులకు హాజరు కాలేదని ప్రజలకు సంబంధించిన పనులు సరిగ్గా చేయడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వైసిపి ప్రభుత్వ ఆయాంలో వందల ఎకరాలు కబ్జా చేశారని, అవన్నీ వెలుగు తీసుకొచ్చి పేద ప్రజలకు పంచి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా ఎంపిడిఒ సచివాలయంలో సిబ్బంది, వారి విధులు గురించి తెలియజేశారు. ప్రజాప్రతినిధులు ఆరోపించిన, సమస్యలకు సరైన పరిష్కారం చూపకపోతే కార్యదర్శులు పైనా, సచివాలయ ఉద్యోగులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కబ్జాలపై తహశీల్దార్ దామోదర్ రెడ్డి స్పందిస్తూ విచారించి త్వరలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం సభాధ్యక్షురాలు అయినా భోగ గీత దేవి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలున్నాయని ఆ శాఖకు సంబంధించిన అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారుల గైర్హాజరుపై ఎంపిడిఒ సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి నోటీసులు పంపిస్తామని చెప్పారు. వీరు పైన తప్పనిసరిగా తీసుకుంటామని, ఎవరూ గైర్హాజరు కాకూడదని హెచ్చఇరంచారు. సచివాలయం ఉద్యోగులపై ఎంపిడిఒ సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉద్యోగస్తులు అందరు కూడా జీతాలు తీసుకుంటూ పనులు చేయకుండా, ప్రజలకు సేవ చేయకుండా ఉండటం అనేది అది నేరం అవుతుందని దీని విషయంలో జాయింట్ కలెక్టర్‌కి రిపోర్టు పంపిస్తామని చేశారు కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు హాజరయ్యారు.

సమావేశంలో జడ్‌పిటిసి ముద్దుకృష్ణారెడ్డి

పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎస్.రామమునిరెడ్డి

సొంత నిధులతో తాగునీటి పైపులైన్

ప్రజాశక్తి - వేంపల్లె

శ్రీచైతన్య పాఠశాల పరిధిలో కొన్ని రోజులుగా పైపులైన్ పగిలి తాగునీరు సరఫరా కాక పోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను స్థానికులు టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన సొంత నిధులతో పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. పంచాయతీలో పనులు చేసేందుకు కార్యదర్శికి, సర్పంచ్‌కు చెక్ పవర్ లేదు. చెక్ పవర్ ఉన్న డిఎల్‌పిఒ దృష్టికి ప్రతి పనినీ తీసుకెళ్లాలి. చెక్ పవర్ ఉన్న అధికారి అనుమతి ఇస్తేనే పనులు చేయాల్సిన పరిస్థితి. షాదీఖానా సమీపంలో రోడ్డు పనులు చేస్తుండడంతో తాగునీటి పైపులు పగిలి మరమ్మతులకు నోచుకోలేదు. తాగునీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పనిచేయకపోవడంతో.. ఆ సమస్య పరిష్కారం చేసి ప్రజలకు తాగునీటిని అందించేందుకు రామమునిరెడ్డి సొంత నిధులతో పైపులైన్ పనులు చేయించారు. ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పైపులైన్ పనులను టిడిపి నేతలతో కలిసి రామమునిరెడ్డి పరిశీలించారు. సకాలంలో ప్రజలకు తాగునీటిని అందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ అధికారులు, అలాంటి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మహమ్మద్ ఇనాయతుల్లా, వేమకుమార్, జబిబుల్లా, బాలకృష్ణారెడ్డి, గడికోట శివ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజాసంక్షేమం కోసమే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రజా సంక్షేమం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాల భూపేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. మండలాల నుంచి అనేక సమస్యలను నాయకులు భూపేష్ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం ఎస్.ఉప్పలపాడు గ్రామంలో రైతన్న మీకోసం, రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెద్దపీట వేసే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, ఎంపిడిఒ, వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రాజధాని పేరుతో రాష్ట్రం అప్పులపాలు

ప్రజాశక్తి - వేంపల్లె

రాజధాని నిర్మాణం పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయడం దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో సెక్షన్ 94, సబ్ సెక్షన్ 3 ప్రకారం రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ భవనం, శాసన మండలి భవనం, మిగతా మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో ఆర్థికసాయం చేయాలని స్పష్టంగా పేర్కొన్నట్లు చెప్పారు. 11ఏళ్లపాటు మోడీ ప్రభుత్వం పిల్లికి భిక్షం వేసినట్లు కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నుండి గ్రాంట్ రూపంలో నిధులు తెప్పించడంలో అటు చంద్రబాబు ప్రభుత్వం, ఇటు జగన్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని తులసిరెడ్డి విమర్శించారు.

శ్రీరంజన్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన వైసిపి నాయకుడు శ్రీరంజన్‌రెడ్డిని శుక్రవారం శుక్రవారం మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, శీను యాదవ్, చెర్లోపల్లి శ్రీనివాసరెడ్డి, గంగరాజు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాగా విశ్రాంతి తీసుకొని తొందరగా కోలుకోవాలని సూచించారు. ఇటీవల కాలు విరిగి చికిత్స చేయించుకొని శ్రీరంజన్‌రెడ్డి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకుని వారు ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE, KADAPA AT PRODDATUR

I.A.No. 1091/2024 in
I.A.No. 1496/2015 in
O.S.No. 47/2015

Shaik Mohammad Ameer Ahammed, Son of Abdul Gaffor Saheb, aged about 56, Resident of D.No.4/385-4, Nandyalampeta, G.V.Satram Village, Mydukur Mandal, Kadapa (D) & Others.
...Petitioner/Third Party

Vs

Kesa Linganna his Lrs, Kesa Parvati, W/o Late Kesa Linganna, R/o. 7/7-1, Proddatur Road, Mydukur Town & Mandal, Kadapa Dist.
...Respondent

NOTICE

పై నెంబరు పిటిషన్‌ను పిటిషనర్లు, రెస్పాండెంట్ పై అయిన నీ పైన క్లెయిమ్ పిటిషన్ రాజశ్రీ పై కోర్టు నందున దాఖలు చేసినారు. అట్టి దావా యందు నీవు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా 9.12.2025 తేదీన పై కోర్టు యందు వాయిదా వున్నది. కావున పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు రెస్పాండెంట్ అయిన నీవు హాజరై పైన తెలిపిన కోర్టు నందు నీకు క్లెమ్ పిటిషన్‌లో ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు కానీ, మీ వకీలు ద్వారా కాని తెలుపుకొనవచ్చును. లేనంతట నీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేది: 9.12.2025

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

SYED KALEEMULLA
C.SHAKEEL AHAMMED
S. ABDULLA
Advocates,
Proddatur.

వికలత్వ పింఛను రూ.15 వేలు ఇవ్వాలని వేడుకోలు

ప్రస్తుతం రూ.6 వేలు - వంద శాతం మందబుద్ధితో పుట్టుక నుంచే మంచానికే పరిమితం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం మంజూరు చేస్తున్న సామాజిక పింఛన్లలో మంచానికే పరిమితమై వంద శాతం వికలత్వం ఉన్న పేద వికలాంగులకు అన్యాయం జరుగుతోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన రాయపాటి పీరయ్య, కుళ్లాయమ్మకు 2012లో రాయపాటి మాబు జన్మించాడు. పుట్టుకతోనే మందబుద్ధితో (మానసిక వికలాంగుడిగా) నడవలేని స్థితి. ప్రభుత్వం మంజూరు చేసే సామాజిక పింఛన్ కోసం సదరం క్యాంపులో దరఖాస్తు చేసుకున్నారు. 2016లో సదరం క్యాంపులో వైద్యులు రాయపాటి మాబును పరీక్షించి వంద శాతం వికలత్వం ఉన్నట్లు నిజ నిర్ధారణ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. పూర్తిగా మంచానికే పరిమితమై తన పని కూడా చేసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. మంచంలోనే కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఈ నేపథ్యంలో కుమారునికి తల్లిదండ్రులు దగ్గర ఉంటూ పరిచర్యలు చేసుకుంటున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేస్తే రూ.15 వేలు ఫింఛన్ వస్తే భాదితుని అవసరాలకు ఆసరాగా ఉంటుందని ఎంతో ఆశగా ఎదురు చూశారు. కానీ ప్రభుత్వం రూ.6వేలు మాత్రమే మంజూరు చేసిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వంద శాతం వికలత్వం ఉన్న తన కుమారునికి రూ.15 వేలు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పీరయ్య, కుళ్లాయమ్మ కోరుతున్నారు.

మంచానికే పరిమితమైన మాబు

కుమారుడ్ని ఎత్తుకున్న తల్లి కుళ్లాయమ్మ

బాలికలు, మహిళల రక్షణ మన బాధ్యత : సిఐ

ప్రజాశక్తి - ముద్దనూరు

చిన్నారులు, బాలికలు, మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలని సిఐ దస్తగిరి సూచించారు. ముద్దనూరు పట్టణంలో శుక్రవారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ 'మహిళల రక్షణ.. మన బాధ్యత', 'రక్షణ పొందడం వారి హక్కు' అనే నినాదంతో అత్యవసర టోల్ ఫ్రీ నెంబర్ల పోస్టర్లు ఆవిష్కరించారు. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో పోస్టర్లు ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలికలు, మహిళల భద్రత కోసం, ఆపద, అత్యవసర సమయాల్లో తక్షణ సాయం పొందేందుకు పోలీస్ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులోకితెచ్చాయన్నారు. అత్యవసర సాయం కోసం డయల్ 112, పిల్లల రక్షణకు 1098, గృహ హింసకు 181, మహిళల వేధింపులకు 1091, సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఏర్పాటు చేసిన పోలీసులు

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు హర్షణీయం

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయమని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. శుక్రవారం ఉపాధ్యాయుల మండలస్థాయి క్రీడా ఎంపికలను లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉపాధ్యాయ మహిళలకు, పురుషులకు వేర్వేరుగా త్రో బాల్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. బోధనతోపాటు, క్రీడలు కూడా నిర్వహించడం ఆటవిడుపు అని తెలిపారు. క్రీడలు ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని, తద్వారా బోధనలో చురుకుతనాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గ స్థాయికి పంపడానికి మండలస్థాయి త్రో బాల్ టీం మహిళా ఉపాధ్యాయుల ఎంపికలు పూర్తి చేశామన్నారు. మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారన్నారు. నియోజకవర్గ స్థాయిలో డిసెంబర్ 13,14 తేదీల్లో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపేట హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఇఒ

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

రైతులకు సూచనలిస్తున్న ఎడిఎ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - చాపాడు

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమూర్తి సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపేట, వీరభద్రపురం గ్రామాల్లో శుక్రవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఎఒ దేవి పద్మలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. వరి పంట నూర్పిడి చేసే రైతులు కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి, పంచాయతీరాజ్ ఎఇ చంద్రమౌళి, టిడిపి నాయకులు శేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో ఎఒ వి చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి శనగ, ఆముదం పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగలో ప్రధానంగా వేరుకుళ్లు, మొదలు కుళ్లు తెగులు ఆశించినట్లు గమనించారు. వీటి నివారణకు వారు పలు సూచనలు చేశారు. అనంతరం అచ్చవెల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీతో అందిస్తున్న పురుగు మందులను పంపిణీ చేశారు. అచ్చివెల్లి గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాల కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్ సాయి ప్రసన్న, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పావని, రైతులు పాల్గొన్నారు

వేంపల్లె : రైతులు సాగు చేసిన చామంతి, మినుము, బుడ్డ శనగ, పెసర పంటలకు సోకిన వేరుకుళ్లు తెగులు నివారణకు సకాలంలో మందులను పిచికారీ చేయాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని నందిపల్లె, కత్తులూరు గ్రామాల్లో శుక్రవారం పలు పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వేరుకుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తించారు. చామంతి పంటకు వేరుకుళ్లు, బుడ్డశనగకు తడి వేరుకుళ్లు, మినుములో బూడిద తెగులు సోకిందన్నారు. వర్షాలు కురవక ముందే రైతులు పంటలకు మందులను పిచికారీ చేయాలని శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ కుమార్ సూచించారు. రాబోయే రోజుల్లో తుపాను ప్రభావం ఉన్నందున మందులు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మాధురి, డాక్టర్ కృష్ణప్రియ, ఎఒ శివశంకరరెడ్డి, డిఎఎటిటిసి కో-ఆర్డినేటర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కత్తులూరులో మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - లింగాల

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పులివెందుల రూరల్ సిఐ ఎస్‌వి రమణ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన మహిళల భద్రత, రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సామజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహాలు చేయడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వారిపై దాడులకు పాల్పడినా టోల్ ఫ్రీ నెంబర్లు 112, 181, 1930 ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వేంపల్లె : సైబర్ నేరాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సిఐ నర్సింహులు పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాలు, శక్తి యాప్, మహిళలపై లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నర్సింహులు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతుంటే సంబంధిత అధికారులకు విద్యార్థులు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపదలో ఉన్న బాలికలు, మహిళలు 181, 1091, 1098 నెంబర్లుకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. శక్తి యాప్‌ను ప్రతి విద్యార్థిని ఫోన్‌లో పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండూరు : ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల రూరల్ సిఐ బి.మురళి నాయక్, ఎస్‌డిపిఒ ఎన్.వెంకటరమణ పర్యవేక్షణలో సిబ్బందితో శుక్రవారం మల్లెల మహిళా పోలీసులు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళల రక్షణ కోసం వివిధ చట్టపరమైన నిబంధనలను వివరించారు.

తొండూరు : మల్లెలలో మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డిసిసి ఎన్నికలో పారదర్శకతే లక్ష్యం : ఎంపీ విజయ్‌వసంత్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎన్నికలో పారదర్శకతేలక్ష్యంగా పని చేస్తామని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ విజయ్‌వసంత్ తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రక్రియను తాను పర్యవేక్షిస్తున్నానన్నారు. మండల, క్షేత్ర స్థాయి నుండి నాయకుల అభిప్రాయాల ఆధారంగా డిసిసి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించడమే లక్ష్యంగా తీసుకున్నామన్నారు. తన పర్యటన పూర్తిగా డిసిసి నియామకంపై నాయకులను కార్యకర్తలను కలుసుకోవడానికే అన్నారు. అనంతరం డిసిసి అధ్యక్షురాలు విజయ జ్యోతి మాట్లాడుతూ రాహుల్ గాంధీ సూచన మేరకు డిసిసి అభ్యర్థిగా సరైన నాయకుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నాయకుల అభిప్రాయాలతోపాటు జిల్లా అధ్యక్షుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలు, రైతులను విస్మరించిందని విమర్శించారు. ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ డిసిసిని పారదర్శకంగా ఎన్నుకోవడమే అన్నారు. పార్టీకి సంబంధించిన కార్యకర్తలు, నాయకులు ఆ పదవికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా, షర్మిలను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

మైదుకూరు యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు యుటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నికను శుక్రవారం జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.అనీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి. శేఖర్, ట్రెజరర్ ఎస్.పీర్‌బాషా, గౌరవ అధ్యక్షులుగా ఎం.సిరాజుద్దీన్, అస్లాం, సహాధ్యక్షులుగా సి.శ్రీనివాసులు, సహాధ్యక్షురాలు ఎ.గుల్జార్ బేగం, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.అనిల్‌కుమార్, బి.శేఖర్, అర్.శివశంకర్, వనమాల రాము, కార్య దర్శులుగా శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లు, రామయ్య, సూర్య, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టెట్ విషయంలో సీనియర్ ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు, ఐఆర్, పిఆర్సీ అంశాలపై పోరాటం చేస్తామని తెలిపారు.

నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలను శుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని నగరిగుట్ట, యర్రంరెడ్డి పల్లెలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మలేరియా, డెంగీ, చికున్‌గన్యా వంటి వ్యాధుల వ్యాపి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు. ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో దోమ గ్రుడ్డు పెట్టి, గుడ్డు నుండి లార్వా, లార్వా నుండి దోమగా వస్తుందన్నారు. రాత్రి దోమతెరలు తప్పనిసరిగా వాడాలని సిద్దయ్య సూచించారు. కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, ప్రశాంతి, ఆశా నాగేశ్వరీ పాల్గొన్నారు.

'ఉషాకిరణ్' పూర్వ విద్యార్థికి అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఉషాకిరణ్ పాఠశాల పూర్వ విద్యార్థి (పదో తరగతి 2008) ముత్తుకూరు రత్నంకు అరుదైన గుర్తింపు లభించింది. ఢిల్లీకి చెందిన నీతి అయోగ్, రాష్ట్రీయ నైతికత సమ్మన్ వారు 2025 సంవత్సరానికిగానూ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో పోటీ పరీక్షలకు శిక్షణనిచ్చే 100 మంది ఉత్తమ బోధకుల్లో ఒకరైన రత్నంను ఎంపిక చేశారు. పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులకు ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించడంలో రత్నం విశేషంగా కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రశంసాపత్రాన్ని రత్నం అందుకున్నారు. తమ పూర్వ విద్యార్థికి ఇలాంటి అరుదైన గౌరవం లభించడం పట్ల ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని కరస్పాండెంట్ ఆకాంక్షించారు.

రత్నం

ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

భగవద్గీత పఠనం పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. వీరిని శుక్రవారం చక్రపాణిరెడ్డి అభినందించారు. వై.కీర్తి, బి.మోక్షిత లక్ష్మి, తారక్ నంద గుప్తా, హేమసాయి విద్యార్థులు జిల్లా స్థాయిలో పెట్టిన భగవద్గీత పఠనం పోటీల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు భగవద్గీత పఠన నైపుణ్యాలను, స్ఫూర్తిని, మనో నిబద్ధతను ప్రదర్శించారని ప్రశంసించారు. ఈ విజయంతో పాఠశాల విద్యార్థుల్లో సాంస్కృతిక మానసిక, ఆధ్యాత్మిక ప్రతిభకు ప్రోత్సాహం లభించిందని పాఠశాల డైరెక్టర్లు శ్రీచైతన్య రెడ్డి, చేతన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

తుపాను వల్ల వెన్ను దశలో నేల పాలైన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి.రమణ కోరారు. మండలంలోని మడూరు గ్రామ పొలాల్లో శుక్రవారం ఆయన దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో రైతు దెబ్బతిన్న సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం భవిష్యత్తులో ఆదుకుంటామని ప్రచారం చేయడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికే రాయలసీమలో ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక రైతు నష్టపోయాడన్నారు. ఇప్పటికీ రూపాయి కూడా ఉల్లి రైతుకు సహాయం అందించలేదన్నారు. అధికవర్షం వల్ల వెన్నుదశలో వరి పంట సాగు చేసిన రైతులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి రైతుకు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి నాయకులు మూలే రామాంజనేయరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - తొండూరు

గొర్రెలకు వ్యాపించే గాలికుంటు (నీలి నాలుక) వ్యాధుల పట్ల గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఎడి అమర్నాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఇనగలూరు గ్రామంలో శుక్రవారం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి సోకకుండా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎడి సందర్శించి, గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలను స్వయంగా వేశారు. అనంతరం ఆయన గొర్రెల కాపరుల మంద వద్దకు వెళ్లి గొర్రెలకు సోకే వివిధ జబ్బులపై ఆరా తీశారు. నీలి నాలుక వ్యాధి వచ్చే ఆస్కారం ఉన్నందున, ముఖ్యంగా సాయంత్రం వేళ వేప ఆకులతో పొగ వేసుకోవాలని సూచించారు. గొర్రెలకు జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకురాలు మౌనిక, కృష్ణ, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

గొర్రెను పరిశీలిస్తున్న ఎడి అమర్‌నాథ్‌రెడ్డి

నేడు లింగాల మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - లింగాల

లింగాల ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధక శాఖ, విద్యాశాఖ, పంచాయతీ శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖతోపాటు అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికతో సమావేశానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేపై ఆరా

ప్రజాశక్తి - లింగాల

కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే చికిత్స అందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అడిషనల్ డిప్యూటీ డిఎంహెచ్ఒ రవిబాబు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. కుష్టు వ్యాధి సర్వేపై ఆయన అరా తీశారు. అనంతరం గ్రామంలో పర్యటించి సర్వేపై ప్రజలతో మాట్లాడారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ భాకరపురం, లింగాల, వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లెప్రసీ కేసులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఖాజా, వైద్యులు ప్రసన్న కుమార్, పిహెచ్ఎన్ కుసుమకుమారి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డిప్యూటీ డిఎంహెచ్ఒ రవిబాబు